ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా
జిల్లా వార్తలు

శుక్రవారం 28 జూన్ 2024



సభకు హాజరైన అశేష జనం

అక్షర యోధునికి అరుణాంజలి

అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో గురువారం జరిగింది. వివిధ రంగాల్లో ఆయన చేసిన సేవలను ముఖ్య అతిథులు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కొనియాడారు. రామోజీరావు చిత్రపటానికి అరుణాంజలి ఘటించారు. 6లో..



రామోజీరావు చిత్రపటానికి పూలు చల్లి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు దంపతులు

వర్షాతిరేకాలు

జూన్ చివరిలో ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెండ్రోజుల క్రితం వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లా ప్రజలు అల్లాడిపోయారు. కాలువలకు నీటి విడుదల చేయకున్నా బోరు నీటిని ఆధారంగా చేసుకుని, వర్షం కురుస్తుందనే ఆశతో రైతులు నారుమడులు పోశారు. వడగాల్పులు వీయడంతో వాతావరణం సహకరించక నారుమడుల్లో ఎదుగుదల లోపించింది. వెదజల్లే పద్ధతి ద్వారా వరినాట్లు పూర్తిచేసిన రైతులు వర్షం కోసం ఇంతకాలంగా ఆకాశంవైపు ఆశగా చూశారు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు జిల్లావ్యాప్తంగా చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. మరో రెండు రోజులపాటు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని గురువారం వాతావరణశాఖ తెలిపింది. ముసురు పట్టడంతో వ్యవసాయానికి కొంతమేర అనుకూలంగా మారుతుందని రైతులు భావిస్తున్నారు.



- వర్షంతో వరిసాగుకు సిద్ధమవుతున్న రైతులు
- గుడ్లవల్లేరులో అత్యధికంగా 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం
- 15 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిన వరినాట్లు
- 1500 హెక్టార్లలో నారుమడులు
- కోస్తా తీరం వెంబడి రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనాగా ఉంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 15 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిన వరినాట్లు వేశారు. జూన్‌లో ఆశించినమేర వర్షాలు కురవకపోవడంతో వెదజల్లే పద్ధతిన విత్తనాలు జల్లిన పొలాల్లో మొలకెత్తిన వరి వాతావరణం అనుకూలించక గిడసబారినపడే స్థితికి చేరుకుంది. బుధ, గురువారాల్లో కురిసిన వర్షంతో వరిపైరు కొంతమేర ఊపిరి పోసుకుంటుందని రైతులు చెబుతున్నారు. వెదజల్లే పద్ధతిన వరి విత్తనాలు జల్లిన పొలాల్లో పదిరోజులకు కలుపు మందు చల్లారు. పదిరోజుల తరువాత ఎరువులను చల్లేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కంకిపాడు మండలం కోలవెన్ను, తదితర గ్రామాల్లో బోరునీటి ఆధారంగా వరినాట్లు వేసే పనులను రైతులు రెండు రోజులుగా ప్రారంభించారు. పెడన, పెనమలూరు, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు తదితర నియోజకవర్గాల్లో వెదజల్లే పద్ధతిన విత్తనాలు చల్లిన పొలాలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1500 హెక్టార్లలో ఇప్పటివరకు వరి నారుమడులు పోశారు. ఇంతకాలంగా వర్షం కురవకపోవడంతో నారుమడుల్లో ఎదుగుదల లోపించింది. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో నారుమడులు వేగవంతంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. వరినాట్లకు సిద్ధమవుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో పదిరోజుల్లో బోరునీటి ఆధారంగా కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం, పామర్రు, తోట్లవల్లూరు తదిత ప్రాంతాల్లో వరినాట్లు వేగవంతమవుతాయి.

వర్షపాతం వివరాలు ఇలా..

జిల్లాలో గురువారం ఉదయం 8.30 గంటల వరకు గుడ్లవల్లేరులో అత్యధికంగా 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కోడూరులో 6.6 మిల్లీమీటర్లు, జిల్లాసగటు వర్షపాతం 33.1 మిల్లీ మీటర్లుగా నమోదైంది. పెడనలో 69.2, కృత్తివెన్నులో 60.0, బంటుమిల్లిలో 58.2, మొవ్వలో 50.2, మచిలీపట్నంలో 47.8, పామర్రులో 42.6, గూడూరులో 40.0, గుడివాడలో 36.2, కంకిపాడులో 36.0, చల్లపల్లిలో 33.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగాయలంకలో 32.6, పమిడిముక్కలలో 30.6, పెదపారుపూడిలో 24.2, ఉయ్యూరులో 23.6, బాపులపాడులో 19.6, ఘంటసాలలో 19.2, అవనిగడ్డలో 18.8, ఉంగుటూరులో 18.4, తోట్లవల్లూరులో 17.4, పెనమలూరులో 1.4, మోపిదేవిలో 14.2, గన్నవరంలో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఆకాశమంత ఎత్తుకు..

పాస్‌పోర్టుల జారీలో విజయవాడ ప్రాంతీయ కార్యాలయం రికార్డు

- 2023-24లో మొత్తం 3,70,123 పాస్‌పోర్టుల జారీ
- కిందటేడాదితో పోలిస్తే 20 శాతం వృద్ధి
- ఈ ఆర్థిక సంవత్సరంలో 5 లక్షలు దాటే అవకాశం
- ఉత్తమ ప్రాంతీయ కార్యాలయ అవార్డుకు ఎంపిక

బెజవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం రికార్డు నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 3,70,123 పాస్‌పోర్టులను జారీచేసి అందరి దృష్టినీ ఆకర్షించింది. 2022-23 ఆర్థిక సంవత్సరం కంటే 20 శాతం వృద్ధిని నమోదు చేయడంతో విదేశీ మంత్రిత్వ శాఖ ఉత్తమ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అవార్డుకు ఎంపిక చేసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో ప్రస్తుతం రోజుకు 600 మంది దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. ఈ సంఖ్య పెరిగితే.. పాస్‌పోర్టులు జారీచేసే సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా మరిన్ని రికార్డులు నమోదు చేసే వీలుంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ సంవత్సరంలో విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో ఈ సంఖ్యను ఇంకా పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. కార్యాలయాన్ని విస్తరించే దిశగా పనులు చేపడుతున్నారు. మరో నెలలో ఈ పనులు పూర్తి కానున్నాయి. ఇది పూర్తయితే రోజుకు 1,200కు పైగా పాస్‌పోర్టు దరఖాస్తులను పరిశీలించవచ్చు. దీంతో రెట్టింపు సంఖ్యలో పాస్‌పోర్టులు జారీచేసే వీలుంటుంది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి ఆరు లక్షల పాస్‌పోర్టులను జారీచేసే స్థాయి వస్తుంది. (మిగతా 6లో)

అరాచక కాంట్రాక్టర్

వైసీపీ కాంట్రాక్టర్‌ను చూసి హడలెత్తిపోతున్న మున్సిపల్ సిబ్బంది

- గత ప్రభుత్వంలో నోటికి వచ్చినట్టు బూతు పురాణం
- మరో ఇద్దరు కాంట్రాక్టర్‌లతో కలిసి అరాచకాలు
- మాట వినకుంటే పచ్చి బూతులు.. లేదంటే దాడులు...
- ప్రభుత్వం మారిన తరువాతా కార్యాలయంలో తిష్ట
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసే యోచనలో ఉద్యోగులు



> వైసీపీ పాలనలో ఓ కాంట్రాక్టర్ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో మున్సిపల్ ఉద్యోగులను హడలెత్తించాడు. ఉద్యోగులపై చేయి చేసుకోవడం, బూతులు మాట్లాడటం వంటి వికృత చేష్టలతో భయాందోళనకు గురిచేసేవాడు. బిల్లు చేయకున్నా, మాట వినకున్నా దుర్భాషలతో విరుచుకుపడేవాడు. ఆయన్ను తట్టుకోలేక ఉద్యోగులు కొందరు మూకుమ్మడిగా సెలవుపై వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వం మారిన తరువాత కూడా మున్సిపల్ కార్యాలయంలో తిష్టవేస్తుండటంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. బాధితులంతా కలిసి స్థానిక ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గుడివాడ : మున్సిపాల్టీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా సరే తాను చెప్పిన పని చేయకున్నా, తన ఫైల్‌ను వెంటనే ఓకే చేయకున్నా సదరు వైసీపీ కాంట్రాక్టర్ తన విశ్వరూపాన్ని బయటపెట్టేవాడు. వయస్సులో పెద్దవారిని కూడా ఏకవచనంతో సంబోధించేవాడు. మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించేవాడు. ఇద్దరు మున్సిపల్ ఉన్నతాధికారులపై చెయ్యి చేసుకున్నాడు. మరో ఇద్దరు పిల్ల కాంట్రాక్టర్‌లను వెంటేసుకుని కార్యాలయ పనివేళల్లో తిష్టవేసుకుని కూర్చునేవాడు.

కాంట్రాక్టర్‌ను కార్యాలయ బహిష్కరణ చేయాలి

ఇటీవల ఎన్నికల్లో వైసీపీ దారుణ ఓటమితో తమకు మంచిరోజులొచ్చాయని ఉద్యోగులు ఆనందపడ్డారు. అది ఎంతో కాలం నిలవలేదు. వైసీపీ అధికారం కోల్పోయినా సదరు కాంట్రాక్టర్ వ్యవహార శైలిలో మార్పు రాలేదు. వారం రోజులుగా మున్సిపాల్టీకి వస్తుండటంతో ఉద్యోగులు హడలిపోతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా సాగించిన దమనకాండను ఉద్యోగులు మరచిపోలేకపోతున్నారు. ఉద్యోగులందరూ ఏకతాటిపై వచ్చి స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలవాలని నిశ్చయించుకున్నారు. సదరు కాంట్రాక్టర్ ద్వారా తమకు జరిగిన అవమానాలు, తమపై చెయ్యి చేసుకున్న విషయం, బూతు పురాణం, నోటికి వచ్చినట్టు మాట్లాడిన భయానక భాష వంటివి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. అతనిని కార్యాలయంలోకి రాకుండా బహిష్కరించాలని ఉద్యోగుల్లో డిమాండ్ వెల్లువెత్తుతుంది.

టీడీపీ ముఖ్య నాయకుడితో టచ్‌లో?

తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుడొకరితో టచ్‌లో ఉండటంతోనే కాంట్రాక్టర్ దీమాగా కార్యాలయానికి వస్తున్నాడని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. టీడీపీ నాయకుడి అభయంతోనే మున్సిపాల్టీలో తిరిగి రంగప్రవేశం చేసి చక్రం తిప్పేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడని కార్యాలయవర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఐదేళ్లలో, ఎన్నికల సమయంలో తమను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తులకు ఎలా అభిమిస్తారని నాయకులు మండిపడుతున్నారు. తెలుగుదేశంలో ఇటువంటి వ్యక్తులకు చోటు లేదని, ఇవ్వబోరని మరికొందరు నాయకులు చెబుతున్నారు. ఎన్నికల ముందు సదరు కాంట్రాక్టర్, అతని తండ్రి.. మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని వెంట నడిచారు. ఎమ్మెల్యే వెనిగండ్ల కల్పించుకుని తమను ఇబ్బందులకు గురిచేసి జులుం ప్రదర్శించిన వ్యక్తి నుంచి తమకు రక్షణ కల్పించాలని మున్సిపల్ ఉద్యోగులు కోరుతున్నారు.

కూటమిలో చేరిపోతున్నారా?

కాంట్రాక్టర్ స్థానిక ప్రైవేటు పాఠశాల యజమాని ద్వారా ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో టచ్‌లోకి వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నాడు. టీడీపీలో కుదరని పక్షంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో వైసీపీ కాంట్రాక్టర్ తండ్రికి పరిచయాలుండటంతో బీజేపీలో చేరాలనే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. తమ కుటుంబం కూటమిలో చేరుతోందని సంకేతాలను కావాలనే తన సహచరుల ద్వారా వ్యాపింపజేస్తున్నట్టు తెలుస్తోంది.



సృజన్ శిఖర్ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు

డాక్టర్ కేఎస్ రావుకు సృజన్ శిఖర్ పురస్కారం

విజయవాడ కల్చరల్, జూన్ 27 : కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవా న్యాస్ సమితి ప్రతియేటా ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తుంది. భారతీయ భాషా సాహిత్యాల అభివృద్ధికి చేస్తున్న కృషికి, జాతీయస్థాయిలో నిరంతర సాహితీ సేవకూ గుర్తింపుగా డాక్టర్ కె.శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు నాందీ సేవా న్యాస్ సమితి సన్మాన పత్రంలో పేర్కొంది. వారణాసిలో బుధవారం జరిగిన సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త రాజేంద్రప్రసాద్ పాండే స్మారక సాహిత్య కార్యక్రమంలో డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్ శిఖర్ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. లక్ష రూపాయల నగదు బహుమతి అందచేశారు. ప్రముఖ సాహితీవేత్తలు ప్రొఫెసర్ రాధావల్లభ్ త్రిపాఠి, ప్రొఫెసర్ ప్రభాకర్ సింహ్ పాండే, డాక్టర్ శశికళా పాండే ప్రభృతులు పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావు అవనిగడ్డ ప్రాంతానికి చెందినవారు.



కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఆదర్శ నియోజకవర్గం చేస్తా.. : వర్ల

పామర్రు, ఫిబ్రవరి 13 : పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జన్మదిన వేడుకలను గురువారం స్థానిక పాలశీతల కేంద్ర ఫంక్షన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను అభిమానులు పార్టీశ్రేణులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ, అందరి సహాయ సహకారాలతో గ్రామాల్లో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి పామర్రు నియోజకవర్గాన్ని జిల్లాలో ఆదర్శవంతగా తీర్చిదిద్దుతానన్నారు. తొలుత ఎమెల్యే మచిలీపట్నం-విజయవాడ రహదారి నుంచి ర్యాలీగా బయలుదేరి వేడుక ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి కేకు కట్‌చేసి పార్టీశ్రేణులు, అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ రోడ్డులో స్కూటర్ దగ్ధం

విజయవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యూటర్న్ తీసుకునే క్రమంలో స్కిడ్ అయిన స్కూటర్ నుంచి ఒక్కసారిగా మంటలు రేగాయి. ఈ ఘటన విజయవాడ ఎంజీ రోడ్డులో జరిగింది. స్కూటీపై ఓ వ్యక్తి ఎంజీ రోడ్డులోని డీవీ మ్యానర్ ఎదురుగా ఉన్న యూటర్న్ నుంచి పీసీఆర్ వైపు వెళ్లాలనుకున్నారు. ఇక్కడ ఉన్న కటింగ్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో స్కూటర్ స్కిడ్ అయింది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో రహదారులు తడిసి ఉన్నాయి. ఈ కారణంగా వాహనం స్కిడ్ అయిందని భావిస్తున్నారు. ఈ వాహనంలో పెట్రోలు ట్యాంక్ నిండుగా ఉంది. వాహనం రోడ్డుపై పడగానే జారడంతో అగిరవ్వలు రేగాయి. ట్యాంక్ నుంచి పెట్రోల్ లీకవడంతో మంటలు పుట్టాయి. క్షణాల్లో మంటలు పెరిగి వాహనం పూర్తిగా దగ్ధమయింది. పక్కనే షాపుల్లో ఉన్న వారు బకెట్లతో నీళ్లు చల్లినా మంటలు ఆరలేదు. తర్వాత ఒక షాపు నుంచి ఫైర్ గన్ తెచ్చి ఫోమ్ కొట్టడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.



మంటల్లో ద్విచక్ర వాహనం

22 కోడి పుంజుల అపహరణ

కృత్తివెన్ను, జూన్ 27 : అర్ధరాత్రి లక్షల విలువ చేసే పందెం పుంజులను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన కృత్తివెన్ను స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అడ్డపర్ర గ్రామంలో నివాసముంటున్న సూదబత్తుల కృష్ణమూర్తి ఖరీదైన పందెం పుంజులను పెంచి, సంక్రాంతి సీజన్‌లో విక్రయిస్తుంటాడు. ఈ ఏడాది 22 పందెం పుంజులను సిద్ధం చేస్తున్నాడు. ఇందుకోసం 216 జాతీయ రహదారి పక్కన తన ఇంటి పక్క ఖాళీ స్థలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసాడు. పుంజులను ఎప్పటి మాదిరిగా గాబులు కిందవేసి, పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో 2 గంటలకు లేచి చూడగా, మెస్ తలుపులు తాళ్లతో కట్టి ఉన్నాయి. అప్రమత్తమై, లైట్లు వేసి, కోడి పుంజుల వద్దకు వెళ్లగా, పుంజులన్నింటిని దొంగలు అపహరించినట్టు గుర్తించాడు. చుట్టు ఉన్న వలను కోసి, పుంజులను ఎత్తుకెళ్లిపోయారు. దుండగులు పక్కా ప్రణాళికతో ఇంటి తలుపుల వద్ద పెద్ద పెద్ద రాళ్లు దాడి చేసేందుకు సిద్ధం చేసుకుని, బైక్ ప్లగ్‌ను పీకి పక్కన పడేసారు. దొంగతనంలో సుమారు రూ. 2 లక్షల విలువ చేసే 22 కోడి పుంజులు పోయాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.



తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కృత్తివెన్ను, జూన్ 27 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 168 గ్రాముల బంగారం, అరకేజీ వెండిని అపహరించిన సంఘటనపై గురువారం కత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాశ్వాపురం గ్రామానికి చెందిన మాటూరి రవికుమార్ ఈనెల 16న భార్యను విజయవాడ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించి అక్కడే ఉంటున్నారు. ఈ నెల 26న ఇంటి వెనుకవైపు తలుపులు తీసి ఉన్నాయని స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటికి వచ్చి పరిశీలించగా, ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడిఉండి.. 21 కాసుల బంగారం, అరకేజీ వెండి చోరీ జరిగినట్టు గుర్తించి, రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఎస్సై నాగరాజు సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

వీఆర్‌కు ఆర్‌పేట సీఐ..

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఎన్నికలకౌంటింగ్ అనంతరం జరిగిన అల్లర్లలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వైసీపీ నాయకులు, కార్యకర్తలకు అనుకూలంగా వ్యవహరించిన ఆర్‌పేట సీఐ శ్రీనివాసయాదవ్‌పై వేటు పడింది. ఆయనను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటింగ్ అనంతరం మచిలీపట్నం బలరామునిపేటలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా జాప్యం చేశారు. ఈ అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐపై టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నేరుగా మంత్రి కొల్లు రవీంద్ర ఆర్‌పేట సీఐ పనితీరు మార్చుకోకుండా వైసీపీకి అనుకూలంగా ఇంకా పనిచేస్తున్నారని అన్నారు. గతంలో మచిలీపట్నం డీఎస్పీగా పనిచేసిన మాసుంబాషా అధికార పార్టీకి అనుకూలంగా పని చేయడంతోపాటు, ప్రతిపక్ష నాయకులపై కక్షపూరితంగా వ్యవహరించారు. ఆయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వెలువడినట్టు సమాచారం.



రామోజీరావు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న చంద్రబాబు, నారా భువనేశ్వరి.. సంస్మరణ సభకు హాజరైన రాజకీయ, సినీ ప్రముఖులు

కలంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడిన రామోజీ

- మంత్రి కొలుసు పార్థసారథి



పెనమలూరు, జూన్ 27 : రాష్ట్రంలో కానీ, దేశంలోకానీ ప్రజాస్వామ్యానికి ఆపద వచ్చినప్పుడు తన కలాన్ని ఆయుధంగా చేసుకొని కాపాడిన వ్యక్తి రామోజీరావు అని మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. గురువారం సాయంత్రం పెనమలూరు మండలం కానూరు వందడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో స్వర్గీయ రామోజీరావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. అతి సామాన్య కుటుంబంలో పుట్టి చేపట్టిన రంగాల్లో ఎవరెస్టు శిఖరంలా ఎదిగిన రామోజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఎవరైనా ఎంచుకొన్న రంగాల్లో ఉన్నత స్థానాలకు వెళ్లగలరని రామోజీరావు నిరూపించారన్నారు. సభ ప్రారంభానికి ముందు నాయకులు కంభంపాటి రామ్మోహన్‌రావు, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులతో కలిసి రామోజీరావు జీవితంలో సాధించిన విజయాలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కంభంపాటి రామ్మోహన్ మాట్లాడుతూ.. జర్నలిజం, పత్రికారంగానికి దిశానిర్దేశం చేసి మార్గదర్శకుడిగా రామోజీరావు నిలిచారన్నారు. అన్ని విషయాలపై ప్రజలకు సమాచారం ఇవ్వడంలో రాజీ పడేవారు కాదన్నారు. టీడీపీ అఖండ మెజారిటీతో అధికారం చేపట్టినప్పుడు తమ పత్రిక ప్రతిపక్షంలో ఉండి ప్రజల తరపున పోరాడుతుందని గట్టిగా చెప్పిన వ్యక్తి రామోజీరావు అని గుర్తు చేశారు. రామోజీరావు చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు

రామోజీరావు సంస్మరణ సభ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. వందల మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు బందోబస్తు పర్యవేక్షించారు. మచిలీపట్నం నుంచి విజయవాడ వెళ్లే భారీ వాహనాలను మధ్యాహ్నం నుంచి కంకిపాడు వద్ద నిలిపివేశారు. విజయవాడ నుంచి వచ్చే వాహనాలను పెనమలూరు నుంచి కరకట్ట మీదుగా మళ్లించారు. కానూరు వందడుగుల రోడ్డును మధ్యాహ్నం నుంచి పూర్తిగా మూసివేసి అటువైపు వెళ్లే వాహనాలను పోరంకి నిడమానూరు రోడ్డు మీదుగా మళ్లించారు.

రామోజీ ఫొటో ఎగ్జిబిషన్ సందర్శనలో..

రామోజీరావు సంస్మరణ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన రామోజీరావు ఫోటో ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు తిలకించారు. గురువారం జరిగిన స్వర్గీయ రామోజీరావు సంస్మరణ సభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, రామోజీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రామోజీరావు జీవిత విశేషాలను తెలియజేస్తూ ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించారు. విశాఖపట్నంలో ఈనాడు ఆవిర్భావం, సినిమా నిర్మాణం, ఈటీవీ మీటీవీ ఆవిష్కరణ, సమాచారహక్కు చట్టం పరిరక్షణపై ఉద్యమ సమావేశాలు, సారాపై సమరం, తుఫాను బాధితులకు సేవా కార్యక్రమాలు, సినీ రాజకీయ ప్రముఖులతో కలిసి ఉన్న అరుదైన చిత్రాలను ఫోటో ఎగ్జిబిషన్‌లో ఉంచారు. ముఖ్యమంత్రి పలువురు రాష్ట్ర మంత్రులతో కలిసి ప్రదర్శనను తిలకించి అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మంత్రులు నారా లోకేశ్, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, శాసనసభ్యులు ఫోటో ఎగిబిషన్‌ను తిలకించి రామోజీకి ఘనంగా నివాళులర్పించారు.

ప్రాణాలు పోతేగాని పట్టదా!

- నాలుగు నెలల క్రితం పనులకు అత్యవసర సమావేశామా?
- పేటలో పారిశుధ్యంపై కౌన్సిల్‌లో గరం గరం



పారిశుధ్యంపై కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న కౌన్సిలర్లు

జగ్గయ్యపేట, జూన్ 27 : 'నాలుగు నెలల క్రితం జరిగిన పనుల ఆమోదానికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తారా.. ప్రాణాలు పోతేగాని స్పందించరా.. పురపాలకసంఘంలో డయేరియాతో మరణాలు సంభవిస్తే కౌన్సిల్ మొత్తం తలదించుకునేలా చేశారు..' అంటు కౌన్సిలర్లు అధికారుల తీరుపై కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, పాలకపక్ష, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో గవర్నర్ పర్యటన ఏర్పాట్ల సందర్భంగా చేసిన పనులకు నాలుగు నెలల తర్వాత ఆమోదానికి అత్యవసర సమావేశం ఎలా పెడతారని ప్రశ్నించారు. రూ.4.99 లక్షల చొప్పున ఒకే కాంట్రాక్టర్‌కు ఒకేపనికి సంబంధించి నాలుగు బిట్లుగా నామినేషన్ పద్ధతిపై పనులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. వైసీపీ కౌన్సిలర్ పట్టెం మనోహర్ రూ.25లక్షలు పనులను టెండర్లు పిలవకుండా విభజించి ఒక్కరితో చేయించటం నిబంధనలకు విరుద్ధమన్నారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రాణాలు పోతేగాని అధికారులకు పనులు చేయాలని అనిపించటం లేదా అని నిలదీశారు. రెండేళ్లుగా హెడ్ వాటర్ వర్క్స్ అప్రోచ్ రోడ్డు అడిగినా వేయలేదని, ఇప్పుడు డయేరియా సోకి ప్రాణాలు పోతే, మంత్రులు, అధికారులు వస్తున్నారని నామినేషన్‌పై పనులు చేయించారని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ, పట్టణంలో హోటళ్ల తనిఖీలు చేసిన పాపాన పోలేదని, శానిటేషన్ అధ్వానంగా ఉందని శానిటరి ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు. డయేరియా వల్ల కౌన్సిల్ మొత్తం తలదించుకోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ మల్లేశ్వరరావు, డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతురావులు మాట్లాడుతూ, ఎన్నికల పనుల వల్ల కౌన్సిల్ సమావేశం పెట్టకపోవటంతో ఇప్పుడు పెట్టాల్సి వచ్చిందన్నారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, 33 పనుల టెండర్లు దక్కించుకుని చేయని పనులు ఉన్నాయని చెప్పారు. నోటీసులు ఇచ్చి రద్దు చేస్తే డిపాజిట్‌లు వెనక్కి ఇవ్వాల్సిన అవసరం ఉండదని, కౌన్సిల్ ద్వారా రద్దు చేస్తే అలా కుదరదని డీఈ వివరణ ఇచ్చారు.

చేసిన పాపాలు ఊరికే పోవు

- పిన్నెల్లి అరెస్టుపై దేవినేని ఉమా స్పందన

గొల్లపూడి, జూన్ 27 : మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టుతో మాచర్లలో వైసీపీ అరాచకాలకు తెరపడిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన పిన్నెల్లి అరెస్టుపై స్పందించారు. చేసిన పాపాలు ఊరికేపోవనేందుకు పిన్నెల్లి అరెస్టే నిదర్శమన్నారు. ఈవీఎంలను పగులకొట్టి పిన్నెల్లి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. చంబల్‌లోయ మాదిరిగా సొంత సామ్రాజ్యంలా మార్చుకొని లెక్కకు మించిన తప్పులు చేశారన్నారు. దాడులు, హత్యలతో అరాచకాలకు అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు. తప్పులు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని ఉమా అన్నారు.

కేడీసీసీబీ పర్సన్‌ఇన్‌చార్జిగా జేసీ

మచిలీపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా కేంద్ర సహకారబ్యాంక్(కేడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ గీతాంజలి శర్మను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక చీఫ్‌సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైసీపీ ప్రభుత్వహయాంలో ఇంతకాలంగా కేడీసీసీబీ పాలకవర్గాన్ని నామినేషన్ పద్ధతిన నియమిస్తూ వచ్చారు. జిల్లాలోని 424 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. వీటిలో త్రీమెన్ కమిటీలను నియమించి ఇంతకాలంగా నెట్టుకొచ్చారు. పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరగకపోవడంతో కేడీసీసీబీ పాలకవర్గం ఎన్నికలు జరగలేదు. ఇటీవలకాలం వరకు తాతినేని పద్మావతి కేడీసీసీబీ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆమె తనపదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రభుత్వం కేడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జీగా జేసీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మెగా జాబ్‌మేళా రేపు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్తంగా ఈనెల 29న పవిత్ర డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాశాఖాధికారి విక్టర్‌బాబు తెలిపారు. జాబ్‌మేళాలో హెటిరోల్యాబ్స్, పేటీఎం, అరబిందో, యలమంచిలి ఇంజనీర్స్ ప్రైవేట్, ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్, యాక్టు ఫైబర్‌నెట్, అపోలో, కాసా క్రియో మోటార్స్, ధృవంత్ సొల్యూషన్స్, మాత్రే హెచ్‌ఆర్ ఇండియా పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 10, ఐటీఐ, డిగ్రీ పూర్తిచేసి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగులు బయోడేటా, జిరాక్స్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 8142416211కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

చల్లపల్లి, జూన్ 27 : ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశాల మేరకు చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మధుసూదనరావు తెలిపారు. ఈ ఏడాది 6, 7 తరగతుల్లో చేరగోరు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేయబడిన విద్యార్థులను డే స్కాలరుగా 6, 7 తరగతుల్లో ఉచిత విద్య అందిస్తామని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో 46 శాతం ఉత్తీర్ణత

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో కృష్ణాజిల్లా విద్యార్థులు 46.42 శాతం ఉత్తీర్ణులయ్యారని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 3348 మంది హాజరు కాగా 1554 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు జులై 1లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించుకోవచ్చన్నారు.

దారి చూపండి సారూ..!

- జగనన్న లే అవుట్లలో రహదారి, డ్రెయిన్లు ఆక్రమించుకున్న వైసీపీ శ్రేణులు
- స్పందనలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- రహదారి లేక అవస్థలు పడుతున్న నివాసితులు



జగనన్న కాలనీలో అక్రమంగా నిర్మించిన గోడౌన్‌లు, గృహాలు

మోపిదేవి, జూన్ 27 : జగనన్న కాలనీలు, లే అవుట్లు వైసీపీ నేతల అక్రమాలకు అడ్డాగా మారాయి. యథేచ్ఛగా ఆక్రమణలకు బరితెగిస్తున్నారు. మండల కేంద్రమైన మోపిదేవి పంచాయతీ పరిధిలోని ఎస్టీ (యానాదుల) సామాజిక వర్గం కోసం లే అవుట్ త్రీని రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. దానిలో 12 బ్లాక్‌లు కేటాయించి ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురికి మాత్రమే ప్లాట్లు కేటాయించి, మిగిలినది ఇతర సామాజిక వర్గాలకు పంపిణీ చేశారు. నిబంధనల ప్రకారం సెంటున్నర




చొప్పున స్థలాలు కేటాయించాల్సి ఉండగా, అరసెంటు చొప్పున ఆరుగురు లబ్ధిదారులకు 8 గృహాలు నిర్మించారు. ఇతర సామాజికవర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలు అధికారుల అండదండలతో మూడు సెంట్లు చొప్పున ఆక్రమించి ఇల్లు నిర్మించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన లబ్ధిదారులకు కనీసం రహదారి మార్గం కూడా లేకుండా ఇరువైపులా రహదారి, డ్రెయిన్లు ఆక్రమించి గృహాలు, వ్యాపార సముదాయం నిర్మించుకున్నారు. గతేడాదిలోనే పలువురు గ్రామస్థులు ఎస్టీ సామాజికవర్గానికి రహదారి కల్పించి ఆక్రమణలు నిలుపుదల చేయాలని స్పందనలో ఫిర్యాదులు చేయటం జరిగింది. నాటి వైసీపీ ప్రజాప్రతినిధుల అండదండలతో కార్యకర్తల కాసులకు కక్కుర్తి పడి ఎస్టీలకు రహదారి లేకుండా అన్యాయం చేశారంటూ వారు ఆరోపించారు. కనీసం నివాసితులు ఇంటి నుంచి రహదారిపైకి వచ్చేందుకు వీలు లేకుండా మురుగునీటి డ్రెయిన్‌లో దిగి నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కలెక్టర్ ఆదేశాలూ బుట్టదాఖలు

కాలనీలో ఆక్రమణలపై గతేడాది స్పందనలో ఫిర్యాదులపై మచిలీపట్నం ఆర్డీవో, మోపిదేవి తహసీల్దార్‌లను విచారణ అధికారులుగా నియమించి తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలూ బుట్టదాఖలయ్యాయి. లే అవుట్‌లో ఐదుగురు వ్యక్తులు ఒకటిన్నర సెంట్లు కంటే అదనంగా ఆక్రమించుకోవటం జరిగిందని, తహసీల్దార్ నివేదికలు రూపొందించారు. ఆక్రమణలు తొలగించేందుకు నోటీసులు ఇచ్చి మార్కింగ్‌లు సైతం ఇవ్వటం జరిగింది. వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి, స్థానిక అధికారుల ధనదాహంతో ఆక్రమణల ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికైనా వైసీపీ ఆక్రమణలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

సెంటున్నర చెప్పారు.. సెంటు కూడా ఇవ్వలేదు : కాకినేటి కృష్ణ



కాలువ గట్టుపై ఉంటున్నవారికి ప్రభుత్వం స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. సెంటున్నర చొప్పున అని చెప్పి సెంటు కూడా ఇవ్వలేదు. వర్షం వస్తే శ్లాబు నీరు కారుతోంది. ఎవరికైనా చెబితే ఇల్లు కూడా ఇవ్వమని బెదిరిస్తున్నారు. రహదారిని ఆక్రమించారు. మురుగు డ్రెయిన్ గుండా నడవాల్సి వస్తున్నది.

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం - తహసీల్దార్ ఎం.శ్రీవిద్య

మోపిదేవి లే అవుట్-త్రీలో ఆక్రమణలపై ఫిర్యాదులు రావటం జరిగింది. లే అవుట్‌ను పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టేలా పరిశీలన చేస్తున్నాం.

ఆకాశమంత ఎత్తుకు..

(5వ పేజీ తరువాయి)

● అంచెలంచెలుగా..

రాష్ట్ర విభజన తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న ముప్పవరపు వెంకయ్యనాయుడు విజయవాడకు పాస్‌పోర్టు సేవా కేంద్రం రావటానికి విశేష కృషి చేశారు. ఈ కేంద్రం పరిధిలోకి విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాలతోపాటు మరో 13 పోస్టాఫీసు పాస్‌పోర్టు కేంద్రాలు వస్తాయి. విజయవాడలో 2017, ఏప్రిల్‌లో దీనిని ఏర్పాటు చేశారు. 2018వ సంవత్సరంలోనే లక్ష పాస్‌పోర్టుల మార్కును దాటింది. 2020లో 1,22,988 పాస్‌పోర్టులు జారీ చేసింది. ఇలా.. ఏటా లక్షన్నర మంది తక్కువ కాకుండా ఇక్కడ పాస్‌పోర్టులు పొందుతున్నారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో జారీ అవుతున్న పాస్‌పోర్టుల సంఖ్య సగటున 3 లక్షల మేర ఉంటోంది. రానున్న రోజుల్లో 5 లక్షల నుంచి 6 లక్షలకు పెరిగే అవకాశముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వీసా సేవలను అందించటానికి వీలుగా ప్రత్యేక ఎంబసీని కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏర్పడుతోంది.

● కొత్త కార్యాలయంలోకి పరిపాలనా విభాగం

పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయ పరిపాలనా విభాగం కొత్త కార్యాలయంలోకి మారింది. ఇంతకు ముందు వరకు పాస్‌పోర్టు సేవా కేంద్రం, పాస్‌పోర్టు ప్రాంతీయ కార్యాలయాలు రెండూ ఒకేచోట మిడ్ సిటీ హోటల్‌లో ఉండేవి. ప్రస్తుతం పాస్‌పోర్టు సేవా కేంద్రం హోటల్‌లోనే ఉంది. పరిపాలనా కార్యాలయం మాత్రం మనోరమ హోటల్ పక్కనున్న కమర్షియల్ కాంప్లెక్సులోకి మారింది. అలాగే, కొత్త కార్యాలయం ఏర్పాటుతో పాస్‌పోర్టుల ముద్రణ కూడా విజయవాడ నుంచే ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు పాస్‌పోర్టుల ముద్రణ విశాఖపట్నంలో జరిగేది. ప్రస్తుతం విజయవాడలోనే జరుగుతోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.20

డయల్ యువర్ డీఎం నేడు

గన్నవరం, జూన్ 27: ఆర్టీసీ డిపో నందు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12గంటల వరకు నిర్వహిస్తామని డిపో మేనేజర్ పి.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజలు 87909 96090 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

ఉయ్యూరు: ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సూచనలు, సలహాల స్వీకరణల నిమి త్తం శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ కేఎస్ఆర్‌కే ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. 9959224796 నంబరుకు ఫోన్ చేసి, ప్రజలు సలహాలు సూచనలు, ఇవ్వాలని ఆయన సూచించారు.

చంద్రబాబు సీఎం అయ్యారని కాలినడకన వాడవల్లికి లక్ష్మీకిషోర్



హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 27: చంద్రబాబుతోనే యువతకు భవిష్యత్తు సాధ్యమని నమ్మి, ఆయన ముఖ్యమంత్రి అయితే వాడవల్లి వేంకటేశ్వరస్వామికి కాలినడక వస్తానని మొక్కుకున్నానని బాపులపాడు మండలం వైకుంఠలక్ష్మీపురానికి చెందిన అట్లూరి లక్ష్మీకిషోర్ తెలిపారు. చంద్రబాబు ముఖ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో గురువారం గ్రామం నుంచి మంగళవారం ఆల్వేస్ విత్‌బాబు అనే జెండాతో బయలు దేరిన లక్ష్మీకిషోర్ 132కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గురువారం సాయంత్రం వాడవల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరారు. చంద్రబాబు పేరుతో ప్రత్యేక పూజలు చేశారు. తండ్రి బాలసత్య నారాయణ ప్రోత్సాహంతో ఈ మొక్కు తీర్చుకో గలిగానని ఆయన తెలిపారు.

బాపులపాడు పేదల కాలనీ మార్గం అధ్వానం

హనుమాన్‌జంక్షన్, జూన్ 27: బాపులపాడు పేదల కాలనీకి వెళ్లే అప్రోచ్ మార్గం అధ్వానంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బాపులపాడు రైల్వేస్టేషన్ సమీపంలో 20 ఎకరాల్లో పేదల కాలనీ ఏర్పాటు చేసి, అప్రోచ్ మార్గం అభివృద్ధి చేయలేదు. దీంతో కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి రైతుల నుంచి 20 ఎకరాల భూమిని సేకరించారు. లే అవుట్‌ను నామమాత్రంగా అభివృద్ధి చేసి 620 మందికి గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. అందులో 350 గృహాలు నిర్మించారు. వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీలో గృహ నిర్మాణం వేగవంతం చేయడం కోసం ఆనాడు ప్రధాన రహదారిని గ్రావెల్‌తో అభివృద్ధి చేశారు. మిగిలిన అంతర్గత రహదారులను పట్టించుకోలేదు. దీనికి తోడు కాలనీ ప్రధాన రహదారి అప్రోచ్(భూమిని అమ్మిన రైతులు వినియోగించినదారి) మార్గాన్ని కూడా పట్టించుకోలేదు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను తరలించుకోవడానికి వీలుగా అప్రోచ్ మార్గాన్ని నామమాత్రంగా 2022లో అభివృద్ధి చేశారు. ఇపుడా ఆ మార్గం గోతులు పడిపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా గోతుల్లో మురుగు నిలిచి బురదమ యంగా మారుతోంది. ద్విచక్ర వాహనం నడవడానికి కూడా కష్టంగా ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. నూజివీడు ఫ్లైఓవర్ నుంచి కాలనీ వరకు వీధిలైట్లు వేయలేదని, రాత్రి సమయంలో కాలనీకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టిన గత వైసీపీ ప్రభుత్వం కనీస మౌలిక అవసరాలు కల్పించలేదని, తమను గాలికి వదిలేసిందని కాలనీవాసులను ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం పేదల కాలనీని పట్టించుకుని, కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరుతున్నారు.



బాపులపాడు పేదల కాలనీకి వెళ్లే రోడ్డు



పింఛన్ల పంపిణీపై సూచనలిస్తున్న ఎంపీడీవో రత్నకుమారి

1న నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

• కార్యదర్శులకు ఎంపీడీవో రత్నకుమారి ఆదేశం

హనుమాన్‌జంక్షన్, జూన్ 27: లబ్ధిదారులందరికీ సామాజిక పింఛన్లను జూలై 1న పూర్తిగా పంపిణీ చేయాలని, ఆ మేరకు సచివాలయ సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 50 మందికి సచివాలయ సిబ్బంది ఒకరు ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము బట్వాడా చేయాలని సూచించారు. గురువారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమీక్ష చేశారు. పంపిణీ చేసే సిబ్బంది విధిగా ఐడీ కార్డు, యూనిఫాం ధరించాలని ఆదేశించారు. అవసరమైన చోట గుమాస్తా, బిల్లు కలెక్టర్లను కూడా వినియోగించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్న చోట ప్రభుత్వం తదుపరి జారీచేసే సూచనలు ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అహ్మద్, కార్యాలయ ఏవో శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంపులో అభిషేక్ ప్రతిభ

ఉయ్యూరు, జూన్ 27: కేఎల్ యూనివర్సిటీ వడ్డేశ్వరంలో ఈనెల 15 నుంచి 26 వరకు నిర్వహించిన ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ ఎన్‌సీసీ క్యాంపులో ఏజీఅండ్‌ఎస్‌జీఎస్ కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న వి.అభిషేక్ పాల్గొని విశేష ప్రతిభ కనపరిచాడు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని గుంటూరు, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు ప్రదేశాలను సందర్శించారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, అభిరుచుల పట్ల అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వివిధ పోటీలు నిర్వహించగా కాకినాడ గ్రూప్‌నకు ప్రథమ స్థానం లభించింది. ఆ గ్రూప్‌లో ఉన్న అభిషేక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, ఎన్‌సీసీ అధికారి శ్రీరామ్ అభినందించారు.



గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు

ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రాథమిక వైద్య సేవలందిస్తాం

• గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 27: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రాథమిక వైద్య సేవలందిస్తామని గ్రామీణ వైద్యుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరాజు తెలిపారు. వేలేరు అడ్డరోడ్డు వద్ద జాతీయరహదారి పక్కన వంగల వారి కల్యాణమండపంలో హనుమాన్‌జంక్షన్ ఏరియా అధ్యక్షుడు కె.నరసింహారావు అధ్యక్షతన గ్రామీణ వైద్యుల సమావేశం నిర్వహించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వానికి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం తరపున వెంకటరాజు శుభాభినందనలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లి రాంబాబు, గౌరవాధ్యక్షుడు నందూరి ఉమాశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరాజు, కోశాధికారి కె.రంగారావు, నాయకులు ఉమామహేశ్వరరావు, ఏసునాథ్ పాల్గొన్నారు. హనుమాన్‌జంక్షన్ ఏరియా కార్యదర్శి కె.చైతన్య, కోశాధికారి సీహెచ్ ప్రతాప్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు రూ.5 లక్షల వరకు పావలా వడ్డీ రుణాలివ్వాలి

గన్నవరం, జూన్ 27: రైతులకు పంటలపై రూ.5లక్షల వరకు పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం పిలుపు మేరకు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20వేలు ఈ ఖరీఫ్‌లోపే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతో పాటు డెల్టా ప్రాంతాల్లో మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేయాలని కోరారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నుంచి రూ.3లక్షలు పంటకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతాంగానికి చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కామల ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. కాట్రగడ్డ రామచంద్రజోషి, సాంబయ్య, నాగేశ్వరరావు, బాబూరావు, విజయరావు, మోహనరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.



తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉయ్యూరులో సమస్యల కొలువు

• రోడ్డుపైనే లారీల నిలుపుదల • డంపింగ్‌యార్డులా సర్వీసు రోడ్డు

ఉయ్యూరు, జూన్ 27: ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద రోడ్డుపై లారీలు నిలుపుతున్నారు. అవి ప్రమాదాలకు దారి తీసేలా ఉన్నాయి. బస్టాండ్ అవుట్ గేట్ సమీపాన, తోట్లవల్లూరు రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్‌కు వచ్చే రోడ్డులో టిప్పర్లు, లారీలు నిలిపి ఉంచుతున్నారు. దీంతో బస్టాండ్ నుంచి బయటకు వచ్చే బస్సులు, రాజేంద్రనగర్, అంబేడ్కర్‌నగర్, జగజ్జీవన్‌రామ్‌నగర్, శ్రీలంక కాలనీ నుంచి వాహనాలపై బస్టాండ్ సెంటర్‌కు వచ్చి వెళ్లేవారికి లారీలు, బస్సులతో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డు పక్కనే కపిలేశ్వరపురం చానల్ పంటకాల్వ వెళుతోంది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు అదుపుతప్పి కాల్వలో పడిపోతున్నారు. తోట్లవల్లూరు రోడ్డునుంచి వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై ప్రమాదకరంగా నిలుపుతున్న లారీలను పోలీసులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



బస్టాండ్ అవుట్ గేటు వద్ద రోడ్డుపై ఆపిన లారీలు



ఫ్లైఓవర్ సమీపాన డంపింగ్‌యార్డులా సర్వీసురోడ్డు

సర్వీసు రోడ్డులో ముక్కు మూసుకోవాల్సిందే..

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపక్కన కాటూరు రోడ్డు ఫ్లైఓవర్ సమీపాన సర్వీసు రోడ్డు చెత్తకుప్పలతో డంపింగ్ యార్డులా మారింది. దీంతో రోడ్డుపై వెళ్లేవారికి అసౌకర్యం కలుగుతోంది. ఫ్లై ఓవర్ వద్ద నుంచి గండిగుంటవైపు వెళ్లే సర్వీసు రోడ్డుపై చెత్త, వ్యర్థాలు తెచ్చి పోస్తున్నారు. వర్షాలకు చెత్తకుప్పలు కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. రోడ్డుపై వెళ్లేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఉయ్యూరు, గండిగుంట నుంచి కొందరు చెత్త, వ్యర్థాలు తెచ్చి పోయడంతో సర్వీసు రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది. అధికారులు స్పం దించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తపల్లి పాల సొసైటీ మాజీ అధ్యక్షురాలు విమలాదేవి మృతి



బొబ్బా విమలాదేవి(ఫైల్)

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 27: కొత్తపల్లి పాలసొసైటీ మాజీ అధ్యక్షురాలు బొబ్బా విమలాదేవి(90) వృద్ధాప్యంతో గురువారం కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బొబ్బా వీరరాఘవరావు రాష్ట్ర ఆయిల్‌పామ్ గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. విమలాదేవి భౌతికకాయానికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు నివాళులర్పించారు. కొత్తపల్లి పాలసొసైటీ అధ్యక్షురాలిగా మహిళా పాడిరైతులకు విమలాదేవి స్ఫూర్తిగా నిలిచారని, పాడిరైతుల సంక్షేమానికి, గ్రామాభివృద్ధికి కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. విమలాదేవి భౌతికకాయానికి టీడీపీ నాయకులు ఆళ్ల గోపాల కృష్ణ, దయాల రాజేశ్వరరావు, వేముల పల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావర ప్రసాద్, మొవ్వా వేణు గోపాల్, పుట్టా సురేష్, వేగిరెడ్డి పాపారావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మంచినీటి ట్యాంకరు ప్రారంభం



ట్యాంకరును ప్రారంభిస్తున్న శంకరబాబు

పెనమలూరు, జూన్ 27: ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదినం సందర్భంగా యనమలకుదురు గ్రామానికి చెందిన వడ్లమూడి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు టీడీపీ నాయకులు మొక్కపాటి శ్రీనివాస రావుకు గ్రామ ఉపయోగార్థం మూడున్నర లక్షల విలువైన మంచినీటి ట్యాంకరును ఈనెల 18న అందించారు. ట్యాంకరును గురువారం టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకర బాబు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సర్పంచ్ సుభద్ర, నందు, శేఖర్, పాపారావు, అన్నపూర్ణ, పండుల రజిని, లక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కంకిపాడు, జూన్ 27: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని, అందులో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ఎంఈవో ప్రసాద్ అన్నారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఆయనమొక్కలు నాటారు. పాఠశాల హెచ్‌ఎం బి.పద్మ, ఉపాధ్యాయులు, మధ్యాహ్న బోజన పథకం సిబ్బంది పాల్గొన్నారు.

బాపులపాడులో మురుగు సమస్యకు పరిష్కారం

హనుమాన్‌జంక్షన్: బాపులపాడులో మురుగు నీటి పారుదల సమస్యను పరిష్కరించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ సరిపల్లి కమలాబాయి పర్యవేక్షణలో ఈవో సీహెచ్ ప్రసాద్ గురువారం డ్రెయినేజీలో పూడికలు తొలగించి తూములు మార్చి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.

మండవ రమ్యకృష్ణ మృతికి టీడీపీ నేతల సంతాపం

గన్నవరం, జూన్ 27: తెలుగు మహిళ ఉంగుటూరు మండల అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ మృతికి టీడీపీ నేతలు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని మొక్కు చెల్లించేందుకు షిరిడీ వెళ్లి మంగళవారం రోడ్డు ప్రమాదంలో రమ్యకృష్ణ మృతి చెందిన సంఘటన తెలిసిందే. టీడీపీ మండల మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోడపాటి రవికుమార్, మండవ లక్ష్మి, మేడేపల్లి రమ, చిక్కవరపు నాగమణి, జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, జాస్తి శ్రీధర్ సంతాపం తెలిపారు.



రమ్యకృష్ణ మృతి బాధాకరం

హనుమాన్‌జంక్షన్: పోరాట పటిమ గల మహిళా నాయకురాలు మండవ రమ్యకృష్ణ అకాల మృతి చెందడం బాధాకరమని టీడీపీ బాపులపాడు మండల నాయకులు అన్నారు. టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో మండవ రమ్యకృష్ణ చిత్రపటానికి నాయకులు గురువారం నివాళులర్పించారు. వైసీపీ ప్రభుత్వ దమనకాండను రమ్యకృష్ణ ధైర్యంగా ఎదుర్కొన్నారని, ఆ ప్రభుత్వం ఆమెపై అక్రమంగా కేసులు బనాయించిందని అన్నారు. రమ్యకృష్ణ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నాయకులు చిరుమామిళ్ల సూర్యం, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, గండేపూడి నితీష్‌కుమార్, మందాడి రవీంద్ర పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.ల్లో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.20

జలధీశ్వరస్వామి సేవలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ



ఘంటసాల, జూన్ 27 : బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పరిశ్రమలు, వాణిజ్యశాఖ), పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ గల్లా వాణీ మోహన్ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ ఆమెకు స్వామివారి చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు చావలి కృష్ణకిషోర్, ఉమామహేశ్వరరావు, పణీంద్ర పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి




కోడూరు, జూన్ 27 : విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన సంఘటన లింగారెడ్డి పాలెం పంచా యతీ పరిధిలోని జరుగువానిపాలెం జరుగు వెంకన్న భార్య జరుగు నాంచారమ్మ (46) డాబాపైన ఊడ్చేం దుకు వెళ్లగా, సమీపాన ఉన్న మోటార్ వైర్ చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనాస్థలానికి విద్యుత్ శాఖ అధికారులు చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మృతదేహాన్ని డాబాపైనుంచి కిందకి చేర్చారు.

కాల్వలకు నీరు విడుదల చేయాలి

కృత్తివెన్ను, జూన్ 27: సకాలంలో కాల్వలకు నీటిని విడుదల చేయాలని మండల సమావేశంలో సభ్యులు కోరారు. కృత్తివెన్ను మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అధ్యక్షతన జరిగింది. శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, సాగునీరుపై ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే గ్రామాల్లో మంచినీటి చెరువులన్నీ ఎండిపోయాయని, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీటి అవసరం కూడ చాలా ఉందన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు మైల రత్నకుమారి, వైస్ ఎంపీపీ రేవు సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెనిగండ్లను సత్కరిస్తున్న తుమ్మలపల్లి గ్రామస్థులు



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న పెడన టీడీపీ నాయకులు



డయాలసిస్ కేంద్రంలో డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

నందివాడ, జూన్ 27 : గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. తుమ్మలపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ వార్షికోత్సవంలో వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన టీడీపీ దిమ్మెను ఆవిష్కరించి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. గ్రామస్థులు ఎమ్మెల్యే వెనిగండ్ల రామును ఘనంగా సత్కరించారు. రాము మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి లక్ష్యంగా సేవలందిస్తానన్నారు. మండలంలోని 21 గ్రామాలలో మంచినీటి మైక్రో ఫిల్టర్స్ ఏర్పాటు చేస్తానన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ సమయంలో యెర్నేని నాగేంద్రనాథ్, మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి ఉన్నారని, ఇప్పుడు వారు లేకపోవటం బాధాకరమన్నారు. పిన్నమనేని పూర్ణవీరయ్య (బాబ్జీ) మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ప్రతి పథకం అమలు చేస్తారన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు దానేసి సన్యాసిరావు, సర్పంచ్ రాధాకృష్ణ రత్నప్రసాద్, సాంబయ్య, సత్యానందం, సాంబయ్య, కేశవరావు, గద్దె సురేష్, సతీష్, రవి, సురేష్, సోమరాజు, ప్రభాకర్ రెడ్డి, రామశాస్త్రి, వేణు, బాబురావు, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : కాగిత

పెడన : అగస్త్యేశ్వరస్వామి, శ్యామలాంబ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ గురువారం పట్టణంలో ప్రసిద్ధి చెందిన అగస్త్యేశ్వర స్వామి, శ్యామలాంబ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణప్రసాద్‌కు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సలహా సంప్రదింపులతో కృష్ణప్రసాద్ కమిటీలను నియమించారు. ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారానికి వెండితాపడం చేయిస్తానన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈవో టి.వి.వి. మోహనరావు, బళ్ళ ప్రసాద్, కమ్మగంటి బాబు, యక్కల శ్యామలయ్య, చందన నారాయణరావు, అనుముల పూర్ణ, వాసా సాంబశివరావు, ఊటుకూరి సూర్యప్రకాశరావు, అర్జా నగేష్, ఎలిగట్ల ప్రసాద్, మట్టా శివపావని పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

అవనిగడ్డ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిని బుద్ధప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రం, సీమాంక్ కేంద్రం, వార్డులను పరిశీలించి రోగులను వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రిలో జరగాల్సిన పనుల ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని తాగునీటి సమస్యను జిల్లా కలెక్టర్‌కు వివరించానన్నారు. గ్రామాల్లో అధికార యంత్రాంగం తాగునీటి పరీక్షలు చేపట్టారని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్, డాక్టర్ సురేంద్రనాథ్, డాక్టర్ శైలేంద్ర, డాక్టర్ అశోక్, డాక్టర్ లలిత పాల్గొన్నారు. చిన్న వయస్సులో కిడ్నీ వ్యాధులు ఎందుకు వస్తున్నాయో శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని వైద్యులకు సూచించారు.

విద్యార్థిని లిఖితకు అభినందన

అవనిగడ్డ : ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీలో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంక్ సాధించిన ఎస్.వి.ఎల్.క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని అల్లంశెట్టి లిఖిత (466 /470)ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందించి ఘనంగా సత్కరించారు. జూనియర్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, విద్యార్థిని తండ్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడివాడను అభివృద్ధి చేసి చూపిస్తా



డ్రైయినేజీ పూడికతీత పనులను ప్రారంభిస్తున్న వెనిగండ్ల రాము

గుడివాడ : గుడివాడ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పూర్తిస్థాయిలో గుడివాడను అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పాత కంకిపాడు రోడ్డులో రూ.7.88 లక్షల నిధులతో డ్రైనేజీ పూడికతీ పనులను ఆయన ప్రారంభించారు. డ్రైనేజీ సిల్ట్ తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ని యోజకవర్గంలో 23 గ్రామాల పరిధిలో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు నూతన ఫిల్టర్ బెడ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నెరుసు చింతయ్య, వసంతవాడ దుర్గారావు, పొట్లూరి కృష్ణారావు, కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలి

బంటుమిల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా ఎంఈవోలు శ్రద్ధ చూపాలని ఎంపీపీ వెలివెల తారాశశి జోత్స్న కృష్ణ (చినబాబు) అన్నారు. మండల సర్వసభ్య సమావేశం చినబాబు అధ్యక్షతన జరిగింది. విద్యా వ్యవస్థ పనితీరు ఏవిధంగా ఉందో పరిశీలించే సమయం ఎంఈవోలకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలను జిల్లా స్థాయి అధికారులు తనిఖీ చేయకపోవడం వల్ల డిజిటల్ విద్యపై శ్రద్ధ చూపడం లేదన్నారు. ముల్లపర్రు హరిజనవాడలో పాఠశాల ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లంపూడి పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా ఉండడం లేదని సర్పంచ్ తెలిపారు. ఎంఈవో బాల త్రిపుర సుందరి అన్న ఉడకపోవడం వల్లే అలా జరిగిందన్నారు. అన్నం వండడం రాని వారితో పిల్లలకు భోజనం పెడుతున్నారా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యను ప్రస్తావించగా, ఎగువన ప్రాజెక్టులలో నీటి నిల్వలు లేవని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మహిళలకు 20 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు మలిశెట్టి వెంకట రమణ, కొల్లా లలితాశేఖర్, ఓడిమి చిన్నారి బాబు, ఎంపీడీవో రామకృష్ణరాజు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ చొరవ

పామర్రు : అనాథ వృద్ధురాలి పట్ల గ్రామ మహిళా పోలీస్ ఔదార్యం చూపింది. జుర్జువరంలో సంపూర్ణమ్మ (65) ఒంటరి జీవనం గడుపుతోంది. గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికుడు సాంబశివరావు కొన్నాళ్లు వృద్ధురాలి బాగోగులు చూశాడు. అతడు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండి ఆమె బాగోగులు చూడలేకపోతున్నాడు. మహిళా పోలీస్ కె.ఉదయలక్ష్మి ఈ విషయం తెలిసి సంపూర్ణమ్మకు సపర్యలు అందించి ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి అంజనాదేవి అనుమతి తీసుకుని ఆమెను విజయవాడలోని ప్రముఖ వృద్ధుల శరణాలయంలో చేర్పించడానికి తీసుకెళ్లింది. వృద్ధురాలి ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర సూచన మేరకు ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించింది. ఉదయలక్ష్మి 2021లోనూ వేరొక వృద్ధురాలిని ఆదుకుంది. వృద్ధులకు సేవలందిస్తున్న ఉదయలక్ష్మిని పలువురు అభినందించారు.



కుమార్ రాజాను సత్కరిస్తున్న తాడిశెట్టి నరేష్ తదితరులు



తోట్లవల్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు



చోరగుడిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ఘనంగా ఎమ్మెల్యే కుమార్‌రాజా జన్మదిన వేడుకలు

పామర్రు : జన్మదిన వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుమార్‌రాజాను గజమాలతో సత్కరించారు. జనసేన పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయన సతీమణి వర్ల విశ్రమ కుటుంబ సభ్యులతో కలిసి బందరు రోడ్డులోని శ్రీవాసవీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. **తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు టీడీపీ కార్యాలయంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు గొరిపర్తి గోపయ్య కేక్ కట్ చేశారు. పంచాయతీ సభ్యురాలు సింహాచలం, మాజీ ఉప సర్పంచ్ మోహన్ మంజు, పద్మజ, వల్లూరు రాంబాబు, కూసం సురేష్‌రెడ్డి, కె తిరుమలరావు, తోట రామకృష్ణ, దౌలా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పెదపారుపూడి : ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పుట్టిన రోజు సందర్భంగా హ్యాపీ హోమ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. భూషణగుళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, స్పన్ పైప్స్ అధినేత పోలిశెట్టి నాగ సురేష్ వృద్ధాశ్రమంలోని 150 మంది వృద్ధులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వర్ల కుమార్ రాజాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, వృద్ధ మహిళలు, హ్యాపీ హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చోరగుడిలో ఉచిత వైద్యశిబిరం

చోరగుడి (పమిడిముక్కల) : ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పుట్టిన రోజును పురస్కరించుకుని చోరగుడిలో గురువారం సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ టీవీ రమణ, డాక్టర్ బి.వెంగళరావు, గ్రేస్ హాస్పిటల్ సిబ్బంది సేవలందించారు. కుమార్‌రాజా పుట్టిన రోజు సందర్భంగా పలు చోట్ల కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 27 : పత్రికారంగంతో పాటు సేవా రంగం, కళారంగం , వ్యాపార రగంగం, సినీ రంగంలో తనదైన ముద్రవేసుకున్న చెరుకూరి రామోజీ రావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని మాజీ ఎంపీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో రామోజీరావు సంతాపసభ జరిగింది. రామోజీరావు చిత్రపటానికి కొనకళ్ల నారాయణరావు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు కొనకళ్ళ బుల్లయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొనకళ్ల మాట్లాడుతూ, అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని రామోజీరావు నిరూపించారన్నారు. ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచి, సమాజ హితం కోసం పనిచేశారన్నారు. ఐవీసీ కరుణకుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ , టీడీపీ నాయకులు కట్టా అంజిబాబు, పివిఫణికుమార్, దిరిశం బాలకోటయ్య , వేము కోటేశ్వరరావు, సీతారామయ్య తదితరులు నివాళులర్పించారు



రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల

చైతన్య స్కూలు విద్యార్థుల ప్రతిభ


మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం చైతన్య స్కూలు విద్యార్థులు నాసా టెస్టులో జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారు. ప్రతిభ చాటిన డి.లిఖిత, ఎస్ నక్షత్ర, మీర్జా, కె సాయిచరణ్, బి భార్గవ్, బి సాయికుమార్, కె రుత్విక్, సాయి కృష్ణలను అభినందించారు. విద్యార్థులు స్పేస్ హోటల్ అనే ప్రాజెక్టును రూపొందించారు. జోనల్ కో ఆర్డినేటర్ అశోక్ కుమార్, డీన్ పినాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ మణికంఠ, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్‌ఐ రాజేష్, నాసా ఇన్‌చార్జి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీరందించాలి

నాగాయలంక : మండలంలోని 22 పంచాయతీలలో రక్షిత మంచినీటిని ప్రజలకు అందిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సీతారామకుమార్ తెలిపారు. తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతపై సమీక్షించారు. వారానికి రెండు రోజులపాటు ఓవర్ హెడ్‌ట్యాంక్‌లను శుద్ధి చేసి రక్షిత మంచినీటి సరఫరా చేస్తున్నామని అధికారులు వివరించారు. వర్షాలు వల్ల తాగునీరు కలుషితం కాకుండా ముం దస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు, కార్యదర్శులకు సూచించారు.

బీసీల విద్యాభివృద్ధికి సహకరించండి

● నారా లోకేష్‌కు వినతి



మచిలీపట్నం టౌన్ : రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి సహకరించాలని ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర పెరిక సాధికార సమితి సభ్యుడు రామధాని వేణుబాబు కోరారు. గురువారం సచివాలయంలో నారా లోకేష్‌ను కలసి బీసీ విద్యార్థుల సమస్యలను వివరించారు.



గుత్తా సేవా కార్యక్రమాలు

గుడివాడ రూరల్ : గుడివాడలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజయోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ బొమ్ములూరులో మొక్కలు నాటారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వెనిగండ్ల రాము సహాయంతో బొమ్ములూరు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్

పెడన రూరల్ : ఈవోఆర్డీ జయరామ బల్లిపర్రు, నందమూరు, మడక, నడుపూరు, కొంకేపూడి, నందిగామ పంచాయతీలలో పర్యటించి పంచాయతీ చెరువులను, ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది తాగునీటి బావులను క్లోరినేషన్ చేస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యా కిట్లు

కూచిపూడి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాదీవెన కింద 3,071 బ్యాగులు, 3091 బూట్లు విడుదలైనట్లు ఎంఈవోలు ఎన్.శివశంకర్, కాటూరి శ్రీలక్ష్మీ గురువారం తెలిపారు. వెంటనే పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఎంఈవో కార్యాలయ డీఈవో టి.మురళీకృష్ణ, సీఆర్పీలు తాతా సమర్పణరావు, చీలి నాగరాజు, పంది కృష్ణార్జునరావు, చలమలశెట్టి శ్రీమన్నారాయణ, సిహెచ్.నాగ హిమజ, అధికారులు పాల్గొన్నారు.

జేమ్స్‌పేటలో తూముల ఏర్పాటు

గుడ్లవల్లేరు : జేమ్స్‌పేటలో వర్షాలకు రోడ్డు ముంపు బారిన పడకుండా ఆర్‌సీసీ తూములను పంచాయతీ ఏర్పాటు చేసింది. అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు తూములు ఏర్పాటు చేస్తున్నామని కార్యదర్శి నరసింహారావు తెలిపారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న ప్రకాశరావు

అగ్ని బాధితులకు సాయం చేస్తాం

● ఎస్టీ కార్పొరేషన్ ఈడీ ప్రకాశరావు

చల్లపల్లి, జూన్ 27 : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పో యిన నిరుపేద ఎస్టీ కుటుంబానికి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సహాయం చేస్తామని ఎస్టీ కార్పొరేషన్ ఈడీ బి.ప్రకాశరావు తెలిపారు. నారాయణరావునగర్ కాలనీలోని ఎస్టీ ఏరియాలో అగ్నిప్రమాదంలో గరికపాటి యశోదకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధం కాగా, కుంబా నాగేశ్వరమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈడీ ప్రకాశరావు బాధితులను పరామర్శించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా సహాయం, ప్రభుత్వం ద్వారా పక్కా గృహం మంజూరుకు కృషిచేస్తామన్నారు. చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, ఎంపీడీవో కార్యాలయ టైపిస్ట్ వై.శివరామప్రసాద్ పాల్గొన్నారు.



శివాలయం నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

కోడూరు : కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివాలయానికి జయపురం గ్రామానికి చెందిన గోగినేని సోమశేఖరరావు కుటుంబసభ్యులు రూ.1,01,116 విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, జూపూడి సుభాష్ చంద్రబోస్ గురువారం విరాళాన్ని అందుకున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బడే భావన్నారాయణ, అన్నం దానారావు, అన్నం శివరామకృష్ణ, రంగారావు పాల్గొన్నారు.

మోపిదేవిలో హుండీల లెక్కింపు నేడు

మోపిదేవి : సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ ఉద్యోగుల పర్యవేక్షణలో జరిగే లెక్కింపులో ఆసక్తి గల భక్తులు డ్రస్ కోడ్ నిబంధనలతో పాల్గొనవచ్చునని తెలిపారు.